క్లుప్తంగా

సంతలో వైద్య శిబిరం



వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ

కొయ్యూరు: ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అభిషేక్ గౌడ ఆదేశాల మేరకు సంతలు అన్ని ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. మండల కేంద్రంలోని సంతలో ఆదివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాజేంద్రపాలెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. అయితే సంతలో వైద్య శిబిరం ఏర్పాటుకు స్థలం లేక మరోచోట ఏర్పాటుచేశారు. శిబిరంలో సుమారు 100 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు సిబ్బంది తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణను పరామర్శిస్తున్న జెడ్పీటీసీ వెంకటలక్ష్మి

జి.మాడుగుల: విశాఖ కెజీహెచ్‌లో గత రెండు నెలలుగా చికిత్స పొందుతున్న భీరం పంచాయతీ కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బట్టి నారాయణను ఆదివారం సాయంత్రం జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి దంపతులు పరామర్శించారు. కెజీహెచ్‌లో న్యూరో సర్జరీ వార్డులో నారాయణను ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్యం, సదుపాయాలు గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను సూచించారు.

వెన్నుపోటు దినం ర్యాలీ అనుమతికి దరఖాస్తు



పోలీసులకు దరఖాస్తు ఇస్తున్న నాయకుడు రమేష్

అరకులోయటౌన్: వైఎస్సార్‌సీపీ ఈనెల 4న చేపట్టనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి పోలీసుల అనుమతి కోసం పార్టీ నాయకుడు కె.రమేష్ ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో బుధవారం అరకులోయలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి , తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేయనున్నట్టు తెలిపారు. నాయకుడు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే



సంతలో రహదారి దుస్థితి

ముంచంగిపుట్టు: చినుకుపడితే మండల కేంద్రంలోని సంతలో రహదారి చిత్తడిగా మారుతుంది. సంతకు వెళ్లె వీధులన్నీ బురద బురదగా ఉండడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు సంతలోని మార్గాలు అన్ని చిత్తడిగా మారాయి. దీంతో కూరగాయలు, దుస్తులు, ఇతరత్రా కొనుగోలు చేసేందుకు వచ్చే కొనుగోలుదారులు నడిచేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. దారి అంతా చిత్తడి మారడంతో కొంతమంది బురదలో జారిపడుతున్నారు. సంతలో దుకాణాల ఏర్పాటుకు షెడ్లుతో పాటు రాకపోకలకు వీలుగా సీసీ రోడ్డు వేస్తే ఉపయోగకరంగా ఉంటుందని గిరిజన రైతులు, కొనుగోలుదారులు కోరుతున్నారు.

డిపోల ద్వారా రేషన్ పంపిణీ

ముంచంగిపుట్టు: డిపోల ద్వారా రేషన్ అందజేస్తున్నట్టు తహసీల్దార్ నర్సమ్మ చెప్పారు. మండల కేంద్రంలోని డీఆర్ డిపోలో రేషన్‌ను ఆమె ఆదివారం పంపిణీ చేశారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరకులను రేషన్‌దారులకు అందజేయాలని సేల్స్‌మన్‌లకు ఆమె సూచించారు.



పర్రెడ గ్రామంలో చిత్తడిగా మారిన రహదారి



దిగువపేడాపల్లి - ఉక్కుర్బ రోడ్డు దుస్థితి

దారుణదారులు

- అధ్వాన రోడ్లతో అవస్థలు
- అత్యవసర సేవలకు అంతరాయం
- గ్రామస్తుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు



రాళ్లుతేలిన రాసగుప్ప-గొలుగొండ రహదారిపై రాకపోకలు సాగిస్తున్న గ్రామస్తులు

పెదబయలు: మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు అధ్వానంగా ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాడైన రహదారుల మరమ్మతు కోసం కూటమి ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామాల్లో **రహదారులు పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తున్నాయి. రాకపోకలకు గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పలు శివారు గ్రామాల్లోనూ రహదారుల నిర్మాణం జరిగింది. నాటి ముఖ్యమంత్రి** వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన్య ప్రాంతాభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు వెచ్చించారు. నిధులు మంజూరైనా ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో చాలా ప్రాంతాల్లో రహదారుల పనులు నిలిచిపోయాయి. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆటంకం కలిగింది. అయితే ఏడాదిగా వచ్చిన భారీ తుపాన్లు, తరచూ ఏకధాటి వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు దెబ్బతి**న్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా మండలంలో ఒక్క అభివృద్ధి పని చేసిన దాఖలాలు లేవు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతోనూ పనులు చేయలేదు. దీంతో పాటు మండలంలోని** పలుచోట్ల పాడైన రహదారులకు మరమ్మతు పనులు కూడా చేపట్టలేదు. రాళ్లు తేలి, పెద్ద పెద్ద గోతులతో రహదారులు దర్శనమిస్తున్నాయి.

డోలీమోతలే గతి

మండలంలోని మారుమూల కుంతుర్ల పంచాయతీ రాసగుప్ప నుంచి గొలుగొండ వరకు 8 కిలోమీటర్లు తారురోడ్డు 2015లో నిర్మించారు. అప్పటి నుంచి సుమారు పదేళ్ల కాలంలో రోడ్డుకు **ఎలాంటి మరమ్మతు పనులు చేపట్టలేదు. దీంతో తారురోడ్డు పూర్తిగా పాడైంది. ప్రస్తుతం ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని రాసగుప్ప, బైతినలంక,బూరుగుబంద, గొలుగొండ గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.** రోడ్డు బాగాలేకపోవడంతో 108, 104, ఇతర అత్యవసర సేవలు రాసగుప్ప జంక్షన్ వరకు మాత్రమే వస్తున్నాయని, అక్కడ నుంచి ముందుకు రావడం లేదంటున్నారు. అత్యవసర కేసులను 8 కిలోమీటర్లు డోలిపై తీసుకుని రావాల్సి వస్తుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వనభంగి పంచాయతీ దిగువ పేడాపల్లి నుంచి ఉక్కుర్బ వరకు 9 కిలోమీటర్లు తారురోడ్డు అధ్వానంగా మారింది. పెదబయలు నుంచి దిగువపేడాపల్లి దారిలో 9 కిలోమీటర్లు తారురోడ్డు పూర్తిగా రాళ్లు తేలడంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంది. ఈ మార్గం మీదుగానే మండల కేంద్రానికి కిముడుపల్లి, పెదకోడాపల్లి, కుంతుర్ల పంచాయతీలకు చెందిన గ్రామస్తులు రాకపోకలు సాగించేందుకు దగ్గర దారి అయినప్పటికీ మధ్యలో రోడ్డు బాగా లేక గుత్తులపుట్టు మీదుగా అదనంగా అరగంట ప్రయాణించి చుట్టూ తిరిగి రావాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాడేరు నుంచి ముంచంగిపుట్టు వెళ్లే మార్గంలో బంగారుమెట్ట నుంచి చిత్రాయిపుట్టు రోడ్లు పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తున్నాయి. మరమ్మతు పనులు చేయలేదు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టలేదు. నిత్యం అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు.

తరచూ ప్రమాదాలు

మండలంలోని కుజభంగి నుంచి రూడకోట వరకు 10 కిలోమీటర్లు తారురోడ్డు పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తోంది. ఈ రోడ్డు మీదుగా అత్యవసర సేవలు అందడం లేదే ఇదే రోడ్డు మీదుగా పర్రెడ, రూడకోట, కొరవంగి, గిన్నెలకోట, ఇంజరి, జామిగుడ, ముంచంగిపుట్టు మండలంలోని బాబుశాల, కుమడ, భూషిపుట్టు పంచాయతీలు ఆదే రోడ్డుపై వెళ్లాల్సి ఉంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన కలిగిన రోడ్డుకు కూటమి ప్రభుత్వం పట్టనట్టుగా వ్యవహరిస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గోతుల్లో పడి వాహనచోదకులు గాయాలపాలవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి పాడైన రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



కుంతుర్ల పంచాయతీ రాసగుప్ప నుంచి గొలుగొండ వరకు తారు రోడ్లు గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది, ఎన్నిమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీంతో 8 కిలోమీటర్లు మధ్యలో నాలుగు గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. అత్యవసర సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. కూటమీ ప్రభుత్వం , అధికారులు స్పందించాలి.

– కొర్రారు. జ్యోతి, ఎంపిటిసి, కుంతుర్ల సెగ్మెంట్, పెదబయలు మండలం

అత్యవసర సేవలు అందడం లేదు

కుంతుర్ల పంచాయతీ రాసగుప్ప నుంచి గొలుగొండ వరకు తారురోడ్డు అధ్వానంగా మారింది. అత్యవసర 108, 104, అంబులెన్స్‌లు ఈ రహదారి మీదుగా వచ్చే పరిస్థితి లేదు. రోడ్డు బాగాలేని కారణంగా సేవలు అందడం లేదు.కూటమి ప్రభుత్వం, ఐటీడీఏ అధికారులు స్పందించి తారురోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

– వంతాల చిన్నారావు, పెదబయలు మండలం

ప్రతిపాదనలు పంపాం



మండలంలోని 23 గ్రామ పంచాయతీ పరిధిలో పాడైన రోడ్లను గుర్తించాం. అలాగే రోడ్డు లేని గ్రామాలను గుర్తించి ప్రభుత్వానికి, కలెక్టర్‌కు, ఐటీడీఏ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే రోడ్డు పనులు ప్రారంభిస్తాం. గడువులోగా పనులు పూర్తి చేసేందుకు గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

– ఎల్.పూర్ణయ్య, ఎంపీడీవో, పెదబయలు

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి



జాకరవలసలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

హుకుంపేట: మండలంలోని మఠం పంచాయతీ జాకరవలస గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం , సర్పంచ్ మఠం శాంతకుమారి తదితరులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.6లక్షలతో పనులు చేపడుతున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. గ్రామాల్లో ఏ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో వీరాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు వారిని శాలువా ఘనంగా సన్మానించారు. ఎంపీపీ కూడా రాజుబాబు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిరి రవిప్రసాద్, సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, నాయకులు మత్స్యకొండబాబు, సత్యారావు, కామరాజు, ప్రసాద్, కనకరావు తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలని డిమాండ్



వంజరి గ్రామంలో హైవే బాధితులతో కలిసి ధర్నా చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం ప్రతినిధులు

జి.మాడుగుల: మండలంలో వంజరి గ్రామంలో ఆదివారం నేషనల్ హైవే-516ఈ బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బాధితులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మన్నపడాల్ మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో హైవే నిర్మాణంలో భాగంగా స్థలాలు, గృహాలు, పంటలు కోల్పోయిన బాధితులున్నారన్నారు. ఇందులో భాగంగా వంజరిలో-50 కుటుంబాలకు, ములకాయపుట్టులో-40, కడగెడ్డలో-10, వరిగెలపాలెంలో-10 కుటుంబాలకు నష్టపరిహారం ఇస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ అందించలేదన్నారు. ఈ విషయమై కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. గతంలో అప్పటి కలెక్టర్ సుమిత్‌కుమార్ కాలంలో సర్వే చేసి పరిహారం కోసం హామీ ఇచ్చారన్నారు. రెండేళ్ల పాటు కాఫీ, మిరియాల పంటలు, మామిడి తోటలు నుంచి వచ్చే ఆదాయం కోల్పోయామని, ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకొచ్చినా కనీస స్పందన కరువుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ దినేష్‌కుమార్ స్పందించి బాధితులకు నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. లేని పక్షంలో ఈ నెల 5న హైవే రోడ్డు పనులను అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. గ్రామస్తులు సీతారాంనాయుడు, శ్రీనివాస్, కనకాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వొమ్మలిలో మోదకొండమ్మ పండగ



ఘటాల ఊరేగింపులో భక్తులు



మోదమాంబకు పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల : వొమ్మలి గ్రామంలో మోదకొండమ్మ పండగ అంగరంగ వైభవంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ ఉగ్గిన వెంకటరమణ ఆద్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలు శిరస్సున పెట్టుకుని ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటాలు, తప్పెడ గుళ్ళు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

మాడుగుల రూరల్: కింతలి వల్లాపురలో మోదమాంబ పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి పూజలు, అభిషేకాలు, ఘటాలుతో మొక్కులు చెల్లించుకున్నారు.

సాయంత్రం మహిళల కోలాటం, నేలనృత్యాలతో పాటు రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. గత 23 సంవత్సరాల నుంచి అమ్మవారి పండగను ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ రాంబాయి తెలిపారు.

కోటమ్మతల్లి పండగకు ఘనంగా ఏర్పాట్లు



నాతవరంలో వెలసిన కోటమ్మతల్లి

నాతవరం : కోటమ్మ తల్లి పండగ మహోత్సవం ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు. మండల కేంద్రంలో వెలసిన కోటమ్మతల్లిని నాతవరం గ్రామస్తులు పూర్వం నుంచి గ్రామదేవతగా పూజిస్తున్నారు. ఈ అమ్మవారి పండగను మూడేళ్లకోసారి జరుపుకోవడం ఆనవాయితీ. ఈనెల 3వతేదీన పండగ చేసేందుకు వేదపండితులు గ్రామపెద్దలు నిర్ణయించారు. ఇప్పటికే పండగ సందర్భంగా క్రికెట్, షటిల్ ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. గ్రామమంతా విద్యుత్‌తో అలంకరించారు, అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లా వ్యాప్తంగా భక్తులు రానున్న తరుణంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు, రెవెన్యూ పంచాయతీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం నుంచే గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

దుకాణంలో అగ్ని ప్రమాదం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

అనకాపల్లి: స్థానిక రావుగోపాలరావు కళాక్షేత్రం రహదారిలో పాత ఇనుప సామగ్రి దుకాణంలో ఆదివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించింది. గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్ పీక కాల్చిపారేయడంతో ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నామని అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. రూ.లక్ష ఆస్తినష్టం జరిగినట్లుగా నివేదిక ఇచ్చారు. ప్రమాదంతో తీవ్రంగా నష్టపోయిన దుకాణ యజమాని టేకు సత్తిబాబు బోరున విలపించాడు. అగ్నిమాపక ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి పండగ



ఊరేగింపులో భక్తులు

మునగపాక: మునగపాకలో ఆదివారం సత్తెమ్మతల్లి అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. రైతులు తమ కుటుంబాలతో డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు

అనకాపల్లి: సుంకరమెట్ట జంక్షన్ వద్ద సత్యనారాయణ, సూర్యనారాయణ స్వామి దేవాలయానికి ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. స్వామి వారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. పట్టణ, మండలంలో పలు ప్రాంతాల భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అటకెక్కిన సూపర్ సిక్స్ పథకాలు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కూనవరం: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఏడాది గడచినా అమలుకు నోచుకోలేదని జెడ్పీటీసీ గుజ్జా విజయ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల మరియాదాస్ విమర్శించారు. మండలంలోని టేకులబోరులో వైఎస్సార్‌సీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత బస్సు, తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, వలంటీరులకు రూ. పదివేలు తదితర పథకాలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడిందని విమర్శించారు. పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయక పోగా వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులుపెట్టి, పైశాచికత్వం చాటుకుంటుందని ఆరోపించారు.

'వెన్నుపోటు దినం' విజయవంతం చేయాలి

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 4న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గుజ్జా విజయ, ఆవుల మరియాదాసులు కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపు ఇచ్చారు. కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు, దీకొండ గంగాధరరావు, వెంకట రామారావు, పూర్ణానందం, గుజ్జాబాబు, ఎన్ కొండలరావు, భరతమూర్తి, దివాకర్, కరకరా జీమ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా సెల్ టవర్లు

- పనిచేయని సిగ్నల్ వ్యవస్థ
- వినియోగదారుల అవస్థలు

గూడెంకొత్తవీధి: బీఎస్ఎన్ఎల్ టవర్లు అలంకారప్రాయంగా మారాయి. నెలల తరబడి బీఎస్ఎన్ఎల్ సేవలు అందకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. గూడెంకోలనీలో ఏర్పాటు చేసిన టవర్ నుంచి మూడు నెలలుగా సిగ్నల్స్ నిలిచిపోయింది. దీని మూలంగా రీచార్జీలు చేసుకున్న వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ సిగ్నల్ వ్యవస్థ స్తంభించడంతో సమాచారం అందించలేని పరిస్థితి నెలకొందని వినియోగదారులు చెబుతున్నారు. అత్యవసర సేవలైన 108, అంబులెన్స్ కోసం సమాచారం ఇచ్చేందుకు నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక వేరే నెట్‌వర్క్‌ను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందంటున్నారు. మండలంలోని ఎర్రవరంలో టవర్ ద్వారా కూడా బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ రెండు వారాలుగా పనిచేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ కారణంగా నీలవరం, కొత్తగూడెం, డేరాల, అరటితోములు, ఆర్.వి.నగర్‌లో అవస్థలు తప్పడం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



నిరుపయోగంగా బీఎస్ఎన్ఎల్ టవర్